క్లుప్తంగా

అంబలికేంద్రం, చలివేంద్రం ఏర్పాటు



కొల్లాపూర్: రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని పోస్టాఫీసు ముందు అంబలికేంద్రం, చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. సీఐ మహేష్, ఫౌండేషన్ ట్రస్టీ జూపల్లి జగన్మోహన్ రావులు సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ నిర్వాహకులను అభినందించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ రత్నగిరి ఫౌండేషన్ సేవలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ, నాయకులు కమలాకర్‌రావు, పసుపుల నర్సింహ్మ, శ్రీనివాసరావు, ఎక్బాల్, బింగి మహేష్‌యాదవ్, దిలీప్‌శెట్టి, కురుమయ్య, ఖాద్రీ తదితరులు ఉన్నారు.

జిల్లా కార్యవర్గం ఎన్నిక

పెద్దకొత్తపల్లి: బీజేహెచ్‌పీఎస్ యూత్ బేడ, బుడగ జంగం హక్కుల పోరాట సమితి యూత్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గం సమావేశాన్ని ఆదివారం ఎస్వీకే సుందరయ్య విజ్ఞాన కేంద్రం సోయాబ్ హాల్ బాగ్ లింగపల్లి హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు నిడుగొండ సిద్దార్థను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మన్నెం, జాతీయ అధ్యక్షుడు నర్సింహ, ఉపాధ్యక్షుడు వీరప్ప, రాష్ట్ర అధ్యక్షుడు సహదేవుడు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రాజు, మూల స్వామి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో యజ్ఞహోమాలు

తిమ్మాజిపేట: మండలంలోని అప్పాజిపల్లి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు యజ్ఞహోమాలు నిర్వహించారు. యజ్ఞ, హోమాలు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను పూజారులు భక్తులకు వివరించారు. అంతకు ముందు స్వామివారి, ఆండాళమ్మ, లక్ష్మీదేవిలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పూజారి గంగాధర శర్మ, భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బస్టాండ్ ఆవరణలో అన్నదానం



కల్వకుర్తి రూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఆదివారం అమావాస్య సందర్భంగా 300 మందికి అన్న ప్రసాదం వితరణ చేశారు. స్థానిక బస్టాండ్ ఆవరణలో వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం చైర్మన్ జూలూరు రమేష్ బాబు అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు వాస శేఖర్, గంధం ప్రసాద్, మార్కెట్ డైరెక్టర్ శివాలయం శ్రీనివాస్, అప్పాయిపల్లి శ్రీనివాస్, ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.

4 నుంచి శతచండీ మహాయాగం

తాడూరు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణంలో మే 4వ తేదీ నుంచి నాలుగు రోజులపాటు రుద్రసహిత శతచండీ మహాయాగం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు నందుశర్మ, సుదాంశశర్మ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఇంటింటా తిరిగి అందరు మహాచండి యాగానికి పాల్గొని విజయవంతం చేయాలని ఆహ్వాన పత్రికను అందజేశారు.

గాంధీ హైస్కూల్‌లో వైద్య శిబిరం

కొల్లాపూర్: పట్టణంలోని గాంధీ హైస్కూల్‌లో నాగర్‌కర్నూల్‌కు చెందిన మహావేద్, అమ్మ ఆస్పత్రుల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరానికి వచ్చిన రోగులను డాక్టర్ పూర్ణిమ, యస్ నరేన్‌లు పరీక్షించారు. రోగులకు పలురకాల పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను అందించారు. సర్జరీలు అవసరమైన వారికి తగు సూచనలు చేశారు. మహవేద్ ఆస్పత్రి వార్షికోత్సవం సందర్భంగా వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గాంధీహైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వంగూరు: మండలంలోని కొండారెడ్డిపల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి, శంకర నేత్రాలయం ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన కంటి వైద్యశిబిరం ఆదివారంతో ముగిసింది. మండలంలోని పలు గ్రామాల ప్రజలు హాజరయ్యారు. 700మందికి ఆపరేషన్లు, 250 మందికి కంటి అద్దాలు అందజేశారు. ముఖ్యమంత్రి సోదరుడు, గ్రామ కమిటీ చైర్మన్ ఎనుముల కృష్ణారెడ్డి, వేమారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా భవనాలు

- నిలిచిన పాఠశాలల భవన నిర్మాణ పనులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



లింగాల ఉన్నత పాఠశాలలో నిలిచిన తరగతి గదుల నిర్మాణ పనులు

లింగాల: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు–మన బడి పథకం ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు. ఏడాదిన్నర నుంచి పనులు నిలిచిపోయినా ప్రస్తుతం ప్రభుత్వ పట్టించుకోక పోవడంతో భవనాలు అసంపూర్తిగా నిలిచి పోయాయి. ఈ పథకం ప్రారంభంలో మండలంలో మొదటి దశలో 10 పాఠశాలలను ఎంపిక చేశారు. వీటిలో ప్రధానంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, మండల పరిధిలోని కొత్తకుంటపల్లి ప్రాథమిక పాఠశాలలో తరగతి గదుల నిర్మాణాలను చేపట్టారు.

చేసిన పనులకు బిల్లులు రాక..

పనులు చేపట్టిన టెండర్‌దారులు ఆదరాబాదరగా పనులను ప్రారంభించి చేతులెత్తేశారు. చేసిన పనులకు బిల్లులు రాక పోవడంతో పనులు నిలిపివేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బీఆర్‌ఎస్ ప్రభుత్వం దారిలోనే నడుస్తుందని విమర్శలు వినిపిస్తున్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల గురించి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కూలేందుకు సిద్ధంగా ఉన్న తరగతి గదులలో చదువులు కొనసాగించాల్సిన దుస్థితి దాపురించిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఆయా పాఠశాలల్లో గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా నిలిచిన పనులను వెంటనే ప్రారంభించుటకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కొత్తకుంటపల్లిలో..

తరగతి గదులు శిథిలావస్థకు చేరాయి



పలు ప్రభుత్వ పాఠశాలలో తరగతి గదులు శిథిలావస్థకు చేరాయి. విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ చదువులు కొనసాగించాల్సి దుస్థితి నెలకొంది. మన ఊరు–మన బడి పథకంలో చేపట్టిన పనులకు నిధులు విడుదల చేసి అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయించాలి.

– శ్రవణ్‌కుమార్, అవుసలికుంట

బిల్లులు మంజూరు కాలేదు



కొత్తకుంటపల్లి పాఠశాలకు గ్రామ సమీపంలోని నెల్లికొండ గుట్టపై మన ఊరు–మన బడి పథకంలో నూతన తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. పనుల ప్రారంభం నుంచి దశల వారిగా రావల్సిన బిల్లులు మంజూరు కాలేదు. దీంతో కాంట్రాక్టర్ పనులను నిలిపివేశారు. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే పనులు పూర్తయ్యే అవకాశం ఉంది.

– పర్వతాలు, మాజీ సర్పంచు, కొత్తకుంటపల్లి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

మన ఊరు–మన బడి పథకంలో 10 పాఠశాలలను ఎంపిక చేసి పనులను ప్రారంభించారు. కాని తరగతి గదులు, ఇతర నిర్మాణాలు చేపట్టగా బిల్లులు రాక కాంట్రాక్టర్లు అర్ధాంతరంగా పనులను నిలిపి వేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నిధులు విడుదల అయితే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాసులు, పీఆర్‌ఏఈ, లింగాల

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

నాగర్‌కర్నూల్ రూరల్: చదువుతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమని విశ్రాంత డీజీపీ రవీంద్రనాథ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో ఐక్యత సమాజ సంస్థ ఆధ్వర్యంలో మెరిట్ విద్యార్థులకు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. జిల్లాలో వివిధ కళాశాలలో చదివి ఇంటర్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మహేంద్రనాథ్ స్మారక విద్యా పురస్కారాలను అందజేశారు. ప్రభుత్వ కళాశాలలో చదివే పేద విద్యార్థులు మంచి ర్యాంకులు పొందడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఇంటర్ నోడల్ అధికారి వెంకటరమణ, నర్సింహ, భగవేణి, బాలరాజు, రాఘవులు, న్యాయవాది రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు పనులు ప్రారంభం



ఉప్పునుంతల రోడ్డులో పనులు చేస్తున్న కూలీలు

సాక్షి ఎఫెక్ట్..

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఉప్పునుంతల రోడ్డులో అండర్ డ్రెయినేజీ కల్వర్టు పనులు ప్రారంభమయ్యాయి. ఈనెల 25న కల్వర్టు పనులు పూర్తయ్యేనా? అనే శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురితం అయ్యింది. దీంతో అధికారులు స్పందించి పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. బస్టాండు సమీపంలో సైడ్ డ్రెయినేజీ పనులు కొనసాగుతున్నాయి. త్వరతగతిన పనులు పూర్తయ్యేలే చూస్తామని ఆర్‌అండ్‌బీ డీఈఈ జలంధర్ తెలిపారు.

‘ఉగ్రవాదులను ఉరితీయాలి’



నివాళులర్పిస్తున్న నాయకులు

కల్వకుర్తి రూరల్: కాశ్మీర్ అందాలను తిలకించేందుకు వెళ్లిన హిందువులపై ఉగ్రవాదులు కాల్పులు జరిపి పొట్టన పెట్టుకోవడం అమానుష, పిరికిపంద చర్య అని హిందూ ఐక్యవేదిక నాయకులు ఖండించారు. ఉగ్రదాడులలో మృతి చెందిన వారికి ఆదివారం పట్టణంలోని శివాజీ చౌక్ వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదులకు, పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో పురం శేఖర్ రెడ్డి, వివేకానంద, శ్రీధర్, నరేష్ గౌడ్, శేఖర్ రెడ్డి, భావండ్ల మధు, అంజి, మహేశ్వర్ రెడ్డి, సిద్దయ్య గౌడ్, నక్క శీను తదితరులు పాల్గొన్నారు.



పర్యాటకులపై దాడి అమానుషం

కందనూలు: కశ్మీర్‌లని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని నాగర్‌కర్నూల్ నియోజకవర్గ ఫొటో, వీడియో గ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఖండించారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి ఆదివారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. శత్రదేశంపై కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై మద్దతుగా ఉంటామన్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్, శివ, సీనియర్ ఫొటో, వీడియో గ్రాఫర్లు, తదితరులు పాల్గొన్నారు.

42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి



సమావేశంలో బీసీ సంఘాల నాయకులు

కొల్లాపూర్: విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో జనాభా దామాషా ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ రిజర్వేషన్ల సాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని గంగమ్మ గుడిలో బీసీ సంఘాల నాయకులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా బీసీ జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు దాసరి అజయ్ కుమార్ యాదవ్, బీసీ రిజర్వేషన్ల సాధన సమితి నాయకులు శివార్చక విజయ్‌కుమార్, మల్లికార్జున్, శివశంకర్‌యాదవ్‌లు మాట్లాడారు. తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. రిజర్వేషన్ల అమలు కోసం సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా నుంచే ఉద్యమాలు ప్రారంభిస్తామన్నారు. ప్రతి నియోజకవర్గంలో రిలే నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. హక్కుల సాధన కోసం బీసీలు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు మేకల రాముడుయాదవ్, సాయిలు యాదవ్, విష్ణుమూర్తి, భాస్కర్, పురి సుధాకర్, కాశన్న, వేణుగోపాల్‌యాదవ్, రామస్వామి, శీనయ్య, కరుణాకర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ప్రవేశ పరీక్షలు



వెల్దండ: మండల కేంద్రంలో మోడల్‌హైస్కూల్ ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా 6వ తరగతి ప్రవేశానికి 100 సీట్లకుగాను 222 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకోగా 159 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ప్రిన్సిపాల్ శ్రీధర్ పేర్కొన్నారు. అదేవిధంగా 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 196 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 141 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు పేర్కొన్నారు. త్వరలోనే ప్రవేశపరీక్ష ఫలితాలను వెల్లడిస్తామన్నారు.

ముమ్మరంగా వరికోతలు



తాడూరు: మండల కేంద్రంతోపాటు అయా గ్రామాల్లో రైతులు వరికోతల్లో నిమగ్నయ్యారు. మండలంలో వరికొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంతో రైతులు సాగు చేసిన వరి పంటల కోతల పనులు చేపట్టారు. ప్రతి రోజు వాతావరణంలో మార్పులను గమనించి యంత్రాల ద్వారా వరి కోతలను ముమ్మరం చేశారు. వరికోత మిషన్లు అందుబాటులో ఉండకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు మండలంలో 4570 ఎకరాలల్లో వరి పంట సాగు చేసినట్లు అధికారులు తెలిపారు.

మిత్రుడి కుటుంబానికి అండ

వంగూరు: మండలంలోని తుమ్మలపల్లి గ్రామానికి చెందిన తిరుపతయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న 2003వ సంవత్సరం 10వ తరగతి బ్యాచ్ యువకులు రూ.55 వేల నగదు, క్వింటాల్ బియ్యం, దశదినకర్మకు కావల్సిన ఖర్చులకు అందించి అండగా నిలిచారు. బాధిత కుటుంబసభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో షేర్‌ఖాన్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ గ్రామసభ

లింగాల: గ్రామ పంచాయతీలో నిర్వహించిన ఉపాధి హామీ పథకం పనులపై ఆదివారం పంచాయతీ ఆవరణలో సామాజిక తనిఖీ గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 2023 మార్చి నుంచి 2024 ఏప్రిల్ వరకు ఏఏ పనులను నిర్వహించారు, ఎంత డబ్బును ఖర్చు చేశారో తనఖీ బృందం సభ్యులు వివరించారు. తనిఖీ బృందంతో పాటు కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

రేపు సామాజిక తనిఖీ ప్రజావేదిక

మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఈ నెల 29న మంగళవారం సామాజిక తనఖీ ప్రజా వేదికను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాలలో వారం రోజుల పాటు క్షేత్రస్థాయిలో తనిఖీ బృందాలు నిర్వహించిన సామాజిక తనఖీల నివేదికలను ప్రజావేదికలో వివరిస్తారని ఆయన పేర్కొన్నారు.

కొనసాగుతున్న రేణుక ఎల్లమ్మ తల్లి ఉత్సవాలు



లింగాల: మండల కేంద్రంలోని బొడ్రాయి దగ్గర ఐదు రోజులుగా నిర్వహిస్తున్న రేణుక ఎల్లమ్మ తల్లి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. శక్తి పూజారి బైండ్ల గిరి ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ తల్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ప్రత్యేక వేషధారణలో అమ్మవారి ఎదుట ప్రదర్శించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

దళారులకు ధాన్యం అమ్మొద్దు

కల్వకుర్తి రూరల్: దళారులకు ధాన్యం విక్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని జిల్లెల్ల మాజీ సర్పంచ్ రాములు రైతులను కోరారు. ఆదివారం జిల్లెల్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధర ఇవ్వడంతో పాటు రైతులకు రూ.500 బోనస్ ఇస్తుందని తెలిపారు. శ్రీకాంత్ రెడ్డి, శ్యాం సుందర్ రెడ్డి, బాల్ జంగయ్య, మహేందర్, రవి, బాలకృష్ణ, మల్లయ్య, శ్రీశైలం పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ముక్కిడిగుండంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఆదివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సింగిల్ విండో డైరెక్టర్ రఘుపతిరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు సద్వినియోగం చేసుకోవాన్నారు. ఏపీఎం గౌస్, మహిళ సమఖ్య సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు భూ భారతిపై అవగాహన సదస్సు

తిమ్మాజిపేట: మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం భూభారతి చట్టంపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆదివారం తహసీల్దార్ రామకృష్ణయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా కలెక్టర్, ఆర్డీఓ, పార్లమెంటు సభ్యులు, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు హాజరవుతారని తెలిపారు.

తెలకపల్లి: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న భూ భారతి చట్టంపై మండల కేంద్రంలో బీఎస్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం మధ్యాహ్నం 3:00 గంటలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆదివారం తహసీల్దార్ జాకీర్ అలీ ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ సంతోష్, అదనపు కలెక్టర్, ఆర్డీఓ హాజరవుతారని పేర్కొన్నారు.

చెట్ల తొలగింపు

బల్మూర్: అచ్చంపేట నుంచి బల్మూర్ వరకు విస్తరించి ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా గత పదేళ్ల కిందట అటవీశాఖ ఆధ్వర్యంలో నాటిన మొక్కలు ప్రస్తుతం ఏపుగా పెరిగాయి. విద్యుత్ శాఖ అధికారులు, కాంట్రాక్టర్ ఎలాంటి ముందు చూపు లేకుండా నాటిన మొక్కలకు అతి సమీపంలోనే 132 కేవీ విద్యుత్ లైన్ స్తంభాలను ఏర్పాటు చేశారు. చెట్లు స్తంభాల ఎత్తుకు పెరిగి వైర్లను తాకుతున్నాయి. దీంతో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుండటంతో అధికారులు చెట్లను తొలగిస్తున్నారు. ఇదిలా ఉండగా అధికారుల ముందులేకపోవడంతో రూ.లక్షలు విలువ చేసే చెట్లను తొలగించాల్సి వస్తోందని స్థానికులు వాపోయారు.

బీఆర్‌ఎస్ సభకు తరలిన శ్రేణులు



సాక్షి, నెట్‌వర్క్: వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించిన బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్ శ్రేణులు తరలివెళ్లారు. అంతకుముందు గ్రామాల్లో నాయకులు బీఆర్‌ఎస్ జెండాలను ఎగురవేశారు. ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. అచ్చంపేటలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు జెండాను ఎగురవేశారు. కొల్లాపూర్, తిమ్మాజిపేట, తెలకపల్లి, బిజినేపల్లి, తాడూరు, పెద్దకొత్తపల్లి, ఉప్పునుంతల, లింగాల, చారకొండ, వెల్దండ నుంచి నాయకులు, కార్యకర్తలు బయలుదేరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల అధ్యక్షులు తదితరులు ఉన్నారు.



కాంగ్రెస్‌తోనే పేదలకు సంక్షేమం



కల్వకుర్తి రూరల్: పేదల సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయతి విజయ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని బెక్కెరలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా పార్టీ రాష్ట్ర శాఖ మేరకు ముఖ్య నాయకులతో కలిసి గ్రామంలో రాజ్యాంగం పరిరక్షణపై ప్రజలకు కరపత్రాల పంపిణీ చేశారు. బీసీల కులగణన చేపట్టి, ఎస్సీ వర్గీకరణను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దక్కిందన్నారు. కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి, దళపతి గౌడ్, బాలరాజు, వంశీ, భరత్ రెడ్డి, బండి సుదర్శన్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రాములోరి శాంతి కల్యాణం



చారకొండ: మండలంలోని సిర్సనగండ్ల సీతారామచంద్రాస్వామి శాంతి కల్యాణం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బ్రహోత్సవాలు ముగింపు సందర్భంగా ఆలయ ట్రస్టు దేరం వంశస్తులు ఆధ్వర్యంలో కల్యాణం కొనసాగింది. స్వాములవారిని అలంకరించి, మంత్రోచ్ఛరణలతో స్వామివారికి కల్యాణం తంతు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ దేరం రామశర్మ, దేరం లక్ష్మణ్ ర్మ, మురళీధర్ శర్మ, గోపికృష్ణ శర్మ, వేణుగోపాల శర్మ, సీతారామశర్మ, అనంతరామశర్మ, దేవేందర్ శర్మ, రిషిక్ శర్మ, శ్రీధర్ శర్మ తదితరులు ఉన్నారు.

భారత్ సమ్మిట్‌లో పాల్గొన్న అమరేందర్‌రెడ్డి



అచ్చంపేట రూరల్: రాష్ట్ర అభివృద్ధి ప్రపంచానికే చెప్పేందుకే భారత్ సమ్మిట్ 2025ను ప్రభుత్వం నిర్వహిస్తోందని టీపీసీసీ ఎన్‌ఆర్‌ఐ సెల్ అడ్వయిజరీ కమిటీ మెంబర్ బొజ్జ అమరేందర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్‌లో ఆయన హాజరయ్యారు. వందకు పైగా దేశాల నుంచి 500 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. అహింసా, సత్యం, న్యాయం, ప్రజాస్వామ్యం వంటి కాంగ్రెస్ సిద్ధాంతాలపై దృష్టి సారించి ప్రపంచ సమస్యలపై ఈ వేదిక ద్వారా చర్చలు నిర్వహిస్తోందని వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్‌గాంధీ ఆలోచనల మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ప్రపంచానికి భారత్ నాయకత్వం వహించేలా ఈ సమ్మిట్ రూపొందించబడిందన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి నల్లమలకు చెందిన పలు సమస్యలను విన్నవించినట్లు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

బిజినేపల్లి: మండలంలోని వెల్గొండ గ్రామానికి చెందిన కూన మన్నెం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న లక్ష్మీ చెన్నకేశవ సంఘం సభ్యులు ఆదివారం బాధిత కుటుంబానికి రూ.5000 ఆర్థికసాయం అందజేశారు.